

# మృణాళిని నవ్వింది!

దోనేపూడి ప్రేమదులారి

**మృణాళిని నవ్వింది!**

**ఆ నవ్వంటే నాకెంతో ఇష్టం!**

**ఆ నవ్వులో ఆమె అమాయకత్వం కనిపిస్తుంది నాకు. నవ్వుతో అందం ద్విగుణీకృతం అవుతుందనే విషయం నాకు ఆమె నవ్వుని చూసినప్పుడే తెలిసింది.**

ఆమె అలా నవ్వుతుంటే గభాలున దగ్గరకు లాక్కోవాలనిపిస్తుంది. ముఖాన్నంతటినీ ముద్దులతో ముంచేయాలనిపిస్తుంది. ఆ అందాన్ని, చెలరేగేటట్టు చేసే ఆ నవ్వుని సొంతం చేసుకోవాలి.

ఈ విషయాన్ని మృణాళిని మొదటిసారి పరిచయమైనప్పటి నుంచీ అనుకుంటున్నాను. రోజురోజుకీ ఈ కోరిక పెరుగుతోందే కానీ, తరగడంలేదు. ఎన్నాళ్లు మనసుని తొక్కివేయడం! చెప్పేయాలి ...

ఈ విషయాన్ని మృణాళినికి చెప్పేయ్యాలి.

నువ్వు లేకుండా నేనుండలేనని చెప్పేయ్యాలి.

నాదానివైతే పువ్వుల్లో పెట్టి చూసుకుంటానని చెప్పాలి. మనది అమర ప్రేమని లోకానికి చాటుదామని చెప్పాలి!

ఈ నిర్ణయానికి కూడా అంతకు ముందెన్నో సార్లు వచ్చాను కానీ ఆమెకు చెప్పాలంటే భయం!

మృణాళిని ముఖంలో నవ్వు మాయమై కోపం తాండవిస్తుందని భయం!

అసలే ఎర్రటి ముఖం మరింత కందగడ్డలా అయిపోతుందని భయం!

మళ్లీ నా ముఖం కూడా చూడదేమోనని భయం!

భయం....భయం .... భయం...!

గుండెలనిండా ప్రేమ, గుండెల నిండా భయం!

మనసులో ఏవేవో ఆలోచనలు.

ఈ రోజు వాటన్నింటికీ ఫుల్‌స్టాప్ పెట్టేయ్యాలి. విషయాన్ని సూటిగా చెప్పాలి. ఇష్టాన్ని మనసులోనే నొక్కేస్తూ బతకడం కష్టం.

ఆ రోజు అదృష్టం బాగుండి మృణాళిని ఒంటరిగా తగిలింది. ఎప్పుడూ ఆమె వెనకో, నా వెనకో ఎవరో ఒకరుంటారు. వాళ్లముందు విషయాన్ని బయటపెట్టడానికి ఎంతో సంకోచం. మృణాళినికి మొహమాటం తక్కువ. వాళ్లముందే కుండ బద్దలుకొట్టేస్తే?

ప్రేమ ...! భయం ...! కలగాపులగం జీవితం!

అందుకే ఆ రోజు ఒంటరితనం దొరికేసరికి మనసులోని విషయాన్ని మృణాళినికి చెప్పేయ్యాలని తపన.

సెకండ్లు... నిమిషాలవుతున్నాయి.

భయం ధైర్యంగా మారింది.

"మృణాళినీ! ఒక మాటడుగుతాను. సూటిగా జవాబు చెప్పు!" కంగారు నణుచుకుంటూ అడిగాను.

"అడుగు." మృణాళిని నవ్వింది.

ఆమె అందం విజృంభించింది.

సొంతం చేసుకోవాలనే తాపత్రయం పెరిగింది.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను!" చటుక్కున అనేశాను.

"నేనూ ప్రేమిస్తున్నాను. నిన్ను కాదు, మన మిత్రులందర్నీ!" మళ్లీ నవ్వింది మృణాళిని.

"మృణా! ప్లీజ్ నవ్వకు! నన్ను వివశుణ్ణి చేయకు"అనుకున్నాను మనసులో.

"అలా తేలిగ్గా తీసుకోకు. నేను చాలా సీరియస్‌గా అడుగుతున్నాను. మనిద్దరం పెళ్లి చేసుకుందాం!"

"పెళ్లా ...? మనమా ...?" మళ్లీ మళ్లీ నవ్వింది మృణాళిని.

ఆ నవ్వు నన్ను రెచ్చగొడుతోంది - చిలిపి ఆలోచనలతో కాదు, చిరుకోపంతో.

"ఏం? ఎందుకలా అంటున్నావు?"

"నా పెళ్లి ఎప్పుడో నిశ్చయమైపోయింది కాబట్టి!" మాటిమాటికీ నవ్వడం మృణాళిని స్టైల్. అందానికి, వికారానికి మధ్య దూరమెంత?

మొదటిసారి నాకామె నవ్వు వెకిలిగా అనిపించింది. నేను సీరియస్‌గా మాట్లాడుతుంటే ఎందుకలా నవ్వుతోంది?

"నీ పెళ్లి ఎప్పుడో నిశ్చయమైపోయిందా?"

"నేను పుట్టగానే బావతో నిశ్చయమైపోయింది!" నవ్వు.

"మరి మాతో ఇంత చనువుగా ..."

"సరదాగా మాట్లాడటం కూడా తప్పేనా? సరదాగా మాట్లాడిన వాళ్లందర్నీ ప్రేమించేసినట్లేనా? అలాగైతే నేను చాలామందిని ప్రేమించానన్నమాట!" మృణాళిని పడీ పడీ నవ్వుతోంది.

ఆ నవ్వు నన్ను వెక్కిరిస్తున్నట్లుంది.

కడుపులో దేవినట్లుంది.

ఆ నవ్వంటే అసహ్యం వేస్తోంది.

ఆ నవ్వులో ఆమె కుళ్లు కనిపిస్తోంది.

ఆ నవ్వుతో అందం ద్విగుణీకృతమవడంలేదు, వెకిలితనం వెల్లువలా తన్నుకొస్తోంది.

అలా నవ్వుతున్న ఆమెని చటుక్కున దూరంగా తోసేసి ఇవతలికి వచ్చేశాను.

మృణాళిని నవ్వుతూనే ఉంది.

Ⓟ

## ఒక తాగుబోతు కథనం.

"నేను స్టోర్ రూమ్‌లో ఎనిమిది సీసాల బ్రాందీ దాచుకున్నానండీ! అది మా ఆవిడ కంటబడింది. ఒక్కో బాటిలూ తెరిచి, సింక్‌లోకి ఒంపేయకపోతే పుట్టింటికెళ్లిపోతానని కూర్చుందండీ!

ఏం చేస్తామండీ? తప్పనిసరి తద్దినం కదా! మొదలెట్టేనండీ!

మొదటి సీసా బిరడా తీయగానే కాస్త మనసు చలించిందండి. బిరడా పారేసి, డ్రింకంతా సింక్‌లోకి ఒంపేసేముందు ఒక్క గ్లాసుడు మాత్రం తాగేనండి. రెండో సీసాలోంచి బిరడా తీసి పారేసి, అదీ అలాగే ఒంపేసానండీ ... ఒక్క గ్లాసు తప్ప!

మూడో సీసాలోంచి బిరడా లాగేనండి. బిరడా పారేసేనండి ... ఒక్క సీసాతప్ప ... గ్లాసు అంతా సింక్‌లోకి ఒంపేసానండీ!

నాలుగో సింక్ బిరడా లాగేనండి ... సీసా గ్లాసులోకి ఒంపేసానండి.

ఆ తర్వాత దాని బిరడాలోంచి షీషా లాగేనండి! దాంట్లోంచి ఒక షింక్ మాత్రం తాగానండి! తక్కినది ఒంపేషానండీ!

ఆ తర్వాత దాని ... గ్లాసులోంచి ... సి...షింక్ లాగానండి, బిరడా సీ...షీ...సా లోకి పోసేషి ... తాగేసి ... ఒంపేసి ...

తర్వాత సి...షి... సింక్‌కి బిరడా పెట్టేసి ... గ్లాషు షీషా ... సిషా, ...షీసాలోకి ఒంపేసి ... తాగేషి ... షింక్ పారేసి ..."

- ఎమ్బీయస్ ప్రసాద్


మీ తల ఒక రాతిబండ కాదుకదా !

అన్ని కెమికల్ షాంపూలు
మీ తలకు పట్టిస్తే ఎలా ?




మృదువైన మీ చర్మాన్ని శిరోజాలని కెమికల్స్‌తో బాధించకండి. షాంపూలయినా, సాధారణ హెర్బల్ పౌడర్‌లయినా ఒకటే. అందుకే మీ శిరోజాలకు, చర్మ సంరక్షణకు కావాలి, సహజ వనమూలికల సద్గుణ సమ్మేళనం - ధరణీ ఇందులో వుంది శ్రేష్ఠమైన సపిండస్ ట్రిఫోలియాటిస్.

DHARANI FILM INDUSTRY
ప్రతి శుక్రవారము రా. గం. 7.00 లకు
ప్రతి సోమవారము మ. గం. 12.30 లకు
జెమిని టి.వి.లో ప్రసారం

రూ. 2 లక్షలు బంగారు బహుమతులు గెలుచుకోండి.
1-12-1997 నుండి 31-3-1998 వరకు

ధరణి

* హెర్బల్‌పౌడర్ * ఆర్గానిక్ పౌడర్

Mktg. Office : Dharani Forestry & Orchards Limited.
Secunderabad - 500 080, A.P. Ph: 040-7530175 Fax : 040-7530175
గమనిక: కూపన్స్ లేని స్టాక్ కూడా మార్కెట్‌లో కలదు.

PROGRES

First Time in India FARM TO HOME Eco-Friendly Herbal Powder